# వరదేవత

వికె విశ్వనాథ శర్మ



"ఇది నిజమేనా అమ్మా?" తమ గది లోంచి విసురుగా బైటికొస్తూ అన్నాడు మూర్తి.

ముద్ద నోట్లో పెట్టుకోబోతున్న వరలక్ష్మమ్మగారు ఆగిపోయింది తలెత్తి చూసింది.

గుమ్మానికి అటోకాలు, ఇటోకాలు వేసి ఆవేశంతో వూగిపోతున్నాడుమూర్తి.

"ఏవిఁటది బాబూ?" అనునయంగా, అయోమయంగా అడిగింది వరలక్ష్మమ్మ గారు_ చేతిలో ముద్దను కంచంలో వదులుతూ.

క్షణం మాట్లాడలేదు మూర్తి.

వెనక్కి తిరిగి గదిలోకి చూశాడు.

'ఊఁ! కానీండి' అన్నట్టు చూసింది భార్య సువర్చల_చదువుతున్న సాంఘిక నవల పక్కన పెట్టి, మంచంమీంచి లేస్తూ.

భార్య చూపుకు మూర్తిలో మరింత ధైర్యం వచ్చింది.

గుమ్మందాటి తల్లిదగ్గరగా వచ్చాడు.

"ఏవిఁటినాయనా!" కొడుకు ప్రవర్తన కంగారు పుట్టించింది వరలక్ష్మమ్మగారిలో.

"మళ్ళీ ఎందుకొచ్చాడా వెధవ?"

"ఎవరు నాన్నా?"

"వాడే. రాఘవరావ్."

"ఆయనా ... ఆయనా ..." ఏం చెప్పాలో అర్థంకాలే దావిడకు.

"అయనా ఏదో పనుంది ఈ వూరొచ్చాట్ట. చూసిపోదామని వచ్చాడు. విన్ను మరీ మరీ అడిగేన ..."

తల్లి మాటలను పూర్తి కానీలేదు మూర్తి.

"—అమ్మా!" అతని మాటల్లో కారిన్యపు కరుకుదనం వుంది. "నా ఓర్పును చంపేశావు. నేనిక సహించను. నీ దారి నువ్వు చూసుకోవచ్చు" తడబడకుండా చెప్పేశాడు

"బాబూ!" వరలక్ష్మమ్మగారి కంఠంలోకి దుఃఖపు అలలు తన్నుకొచ్చేయి ఆరుపదుల వయస్సు నిండుతున్న ఆమె శరీరంలో ఎక్కణ్ణించో వణుకు పుట్టింది. గుండెదడ ఎక్కువైంది

"ఎంతో కష్టపడి నన్ను పెంచి పెద్దవాణ్ణి చేసావు నువ్వు పడ్డ కష్టాలేవిటో నాకు తెలుసు. నాకొక్కడికే తెలుసునని, ఇంకెవ్వరికీ తెలీవనీ ... డా నువ్వే అన్నావు నీ రెక్కల కష్టంతోనే నాకు రెక్కల్ని ప్రసాదించావు నీ ఆశీర్వాదం వల్లనే నాకీ సంఘంలో గౌరవమైన వుద్యోగం వచ్చింది. కానీ ... కానీ ఇప్పుడు నువ్వే నా గౌరవాన్ని గంగపాలు చెయ్యబోతున్నావు. నిన్ను నా తల్లిగా చూడటానికి నా మనస్సు ఒప్పుకోటంలేదు" మూర్తి కంఠంలోని కారిన్యం ఏమాత్రమూ సడలలేదు

"బా ... బూ ...!" వరలక్ష్మమ్మగారి నోట మాట పెగల్లేదు మనసు తీవ్ర స్పందనకు గురైంది

—తనంత తప్పేంచేసింది? కొడుకు గౌరవానికి భంగకల్గించే విధంగా ఏం ప్రవర్తించింది?

"అమ్మా! ఇదే ఆఖరుసారి ఇంకోసారి ఇలా జరిగినట్టు తెలిసిందో నేనే నీకు దూరంగా వెళ్ళిపోయి బతుకుతాను" అనేసి రివ్వున వెళ్ళి తన గదితలుపులు విసురుగా బిడాయించుకున్నాడు మూర్తి.

వరలక్ష్మమ్మగారి కన్నీళ్ళు కంటివలయాల్లోకి దిగాయి. 'పూర్వం' ప్రళయ సాగర కెరటంలా లేచింది ఆమె మనసులో.

—తను పుట్టిందీ, పెరిగిందీ ఎండుటాకులాటి మధ్యతరగతి కుటుంబంలో. నలుగురు ఆడపిల్లలు ఇద్దరు మొగపిల్లల సంసారాన్ని ఈదలేక నాన్న ఆత్మహత్యకు పూనుకున్నాడు. వూరివాళ్ళందరూ పూనుకుని నాన్నని ఓదార్చి, చెయ్యి అందించారు ఆడపిల్లల్ని అయ్యల చేతుల్లో పెట్టి మొగపిల్లల్ని చదువు చెప్పించేడు

తనకి పెళ్ళయ్యే నాటికి తన వయసు పాతిక నిండింది. ఆయన ఏదో బట్టల కొట్లో గుమస్తా. ఆదాయం, హోదా పిన్న

వయినా, మనసు మహా పెద్దది. ఇద్దరూ ఎంతో అన్యోన్యంగా వుండేవారు.

'అన్యోన్యత'కు నిర్వచనం తామే ఇచ్చారా? అనిపిస్తుంది ఇప్పటికీ తనకి. ఆయన్ని వదలివుండటం మహా దుర్భర మయ్యేది ఎప్పుడైనా ఆయన ఆలస్యంగా వచ్చినా, పనుండి ఏ వూరన్నా వెళ్ళినా.

పెళ్ళయిన రెండేళ్ళకి ఇద్దరి మధ్యా మరో జీవికి చోటు ఏర్పడింది. హృదయాల్లో కొత్త ప్రేమలు, కొత్త అనుభూతులు పుట్టేయి. కొత్త బంధం మనసుల్ని బంధించింది

—కొడుకు పుట్టిన మూడో నెలనే 'బతకని బంధాలు బహు తీపి' అనే కొత్త నిజం నిజమైంది.

—రెండు సంవత్సరాల మూడు నెలలు నిండిన వైవాహిక బంధం పటా పంచలై పోయింది—

భర్త శాశ్వతంగా కన్ను మూసాడు. తనకో దిక్కూ దివానం లేకుండా చేసి తన దారిన తను పోయాడు.

'అయ్యో! నీ భార్యాపిల్లలకి ఏదన్నా దారిచూపించిరా! అంతదాకా ఓపిక పట్టాల్లే' అనేటంత గొప్పదా 'మృత్యువు'? ఈ సృష్టిలో నిస్వార్థమైన పదార్థం ఏదన్నా వుందా అంటే అది ఒక్క 'చావే' నేమో! కానీ అది వరలక్ష్మమ్మ గారి పాలిట శత్రువే. స్వార్థపూరితమే.

పసికందును పొత్తిళ్ళలో పెట్టుకొని అక్కల్ని, అన్నల్ని ఆశ్రయించింది. వాళ్ళ బొటాబొటి బ్రతుకులు ఎంతకాలం ఆమెను భరించగలవూ? మగదిక్కు లేని ఆడదాన్ని ఆదరించగల గుణం ఈ సంఘపు రక్తంలో వుందా? 'విధవ' అనే సర్టిఫికెట్టు నుదుట కట్టి, భర్త పోగానే బీడుపడ్డ భూమిలా చూస్తూ, అశుద్ధంగా, అంటరానిదిగా, అందరికి పెద్ద అపశకున శక్తిగా పరిగణించింది ఈ సంఘం-ఆడదాన్ని. ఇది తరతరాల నుంచీ వస్తున్న చెదరని కెరటం. స్త్రీజాతికి పెద్ద శాపం.


ముఖంమీద కాకపోయినా, మాటల్లో మూటగట్టి "నీదారి నువ్వు చూసుకో" అని చెప్పేసారు అయినవాళ్ళు.

రెండేళ్ళ కొడుకును తీసుకుని వీధిన పడింది తను విరిగిన చెంగు పట్టింది పొట్టకోసం. పసిబిడ్డకోసం.

"నా ఆకలి నువ్వు తీరిస్తే నీ ఆకలి నేను తీరుస్తా" అని తన యవ్వనం వంక చూసిన మగాళ్ళను చూసి చాలా భయపడింది తను

అలా సాగుతున్న జీవిత ప్రయాణంలో అప్పుడు-

"నీకేం అభ్యంతరం లేకపోతే వచ్చి మా ఇంట్లో వుండు వరాలూ" అన్నాడు ఆ వ్యక్తి— ఆయన పేరు పార్వతీశం. ఒకటికి పదిసార్లు బిచ్చకత్తెగా ఆయన కళ్ళబడటం, అతని సానుభూతి చూపులు తనని అతనికి దగ్గరచేసాయి ఆయన అన్న మాటలు ముందు తనలో భయాన్ని




ఆందోళనవి కలిగించాయి ఆలోచించింది. అవసరం, ఎదగవలసిన బిడ్డ ఎక్కవలసిన మహాపర్వతాల్లా కనిపించాయి

పార్వతీశంగారు తన ఇంటి పక్కనే ఒక చిన్నగది చూపించారు. తోడబుట్టిన వాడికన్నా ఎక్కువైన పార్వతీశంగారి పేరును దేవుడికన్నా ముందు తల్చుకునేది. రోజూ ఆయనకి చేతులెత్తి నమస్కరించేది ఆయన దయవల్లే జీవితం సాఫీగా సాగుతోంది అని అనుకునేంతలో. . పార్వతీశంగారు వలభై నిండవి పార్వతీశంగారు తన శరీరాన్ని కోరేరు. కాదు! 'మా ఇంట్లో అయిపోయాయి. ఒక గుప్పెడు అవాలు ఇదులివ్వరూ!' అని అడిగేరంటే బావుంటుంది. ఆలోచించి ఆయన కోరినది ఇచ్చింది. ఇచ్చిన తర్వాత ఏదో ధైర్యం, తెగింపు వచ్చేయి తనకి

ఆ తర్వాత కొద్దికాలానికే పార్వతీశం గారు ఆ వూర్నించి ట్రాన్స్ఫరై వెళ్ళిపోయారు. తనను కొన్నాళ్ళ తర్వాత అక్కడికి రమ్మన్నారు. తనతో కూడా రమ్మంటే పంఘంలో ఆయన తలెక్కడ పెట్టుకుంటాడు? అప్పటికే ఆయన భార్యకు తనమీద అనుమానం కల్గినట్టు, అన్నాచెల్లెళ్ళని అనుకోకపోవటం తనకు తెలిసింది

పార్వతీశంగారు వెళ్ళిపోయారు.

తనూ ఆ వూరు మారబోతుండగా-

"నన్ను అపార్థం చేసుకోనంటే నేను నీ తండ్రిలా నిన్ను చూసుకుంటా" అని తనను చేరదీసిన వ్యక్తి-రాఘవరావు

రాఘవరావు కలప వ్యాపారి. సర్వీ తోటలు కొని, కొట్టించి లారీలద్వారా అడితీలకి సరఫరా చేస్తాడు. రెండు మూడు సంవత్సరాలుగా ఆ వూళ్ళోనే తోటలు కొంటున్నాడు. మాటల్ని బట్టి మనిషి మంచివాడుగా కన్పించేడు. తను ఎంత యోచించినా ఆశించే మంచితనం తనకింత తిండి పెట్టటమేగా! కాని, రాఘవరావు మాటల్లోనేగాక చేతల్లోకూడా మంచివాడనిపించుకున్నాడు. తనావూరొచ్చినప్పు

డల్లా వుండేందుకు వేసుకున్న చిన్న ఇంటిని [illegible]లక్ష్మమ్మకి ఇచ్చేశా

సరిగ్గా తన జీవితయానం ఈ మజిలీ చేరేసరికి కొడుకు వయస్సు ఎనిమిది నిండింది. అతని వూహలు విచ్చుకున్నాయి. తను తండ్రిలేని కొడుకని గ్రహించేడు.

రాఘవరావుని "అయ్య నెవరమ్మా?" అని అడిగేవాడు

"తాతయ్య నాన్నా" అని తను చెప్పేది

అలా అడగటం, తను చెప్పటం కొన్ని నెలల తర్వాత ఎక్కువైంది. అందుక్కారణం తను ఆలస్యంగా గ్రహించింది

—బాధ్యతల ముసుగు కప్పి, పవిత్రానుబంధాల్ని పదివందికి చెబుతూ తమ వాంఛలు తీర్చుకునే మనుషులున్నారు ఈ సమాజంలో. ఆ సమాజంలో మనిషే రాఘవరావు.

—వెలుగున్న పన్నెండు గంటలూ తండ్రిగనూ చీకటి పన్నెండుగంటలూ మొగుడిగానూ చూసేవాడు తనని

—తను మరబొమ్మలా వూరుకుండి పోయింది.

కొడుకు భవిష్యత్తే తనకు కావాల్సింది. కొడుకు కోసమే తనేం చేసినా అదే వూహతో కొన్ని నెలల చీకటి రాత్రులు గడిచేయి గడుస్తున్నాయి

ఒకరాత్రి - రాఘవరావు తనను ఆక్రమించుకున్న వేళ-కొడుకు గాఢనిద్రలో వున్నాడని తను అనుకున్న వేళ-వెక్కిళ్ళతో ఏడుపు వినబడింది. గుడ్డి దీపం పెద్దదిచేసి రాఘవరావు తనమంచం మీద వెళ్ళి పడుకున్నాడు. తనూ తన మంచం మీదికి చేరింది. ఆ ఏడుపు కొడుకుదని తెలుసు. పక్కనే పడుకుని ఆప్యాయంగా కౌగలించుకుంది "ఎందుకు నాన్నా" అని అడిగింది

"అయ్యనెవరమ్మా?" అని వెక్కిళ్ల మధ్య అడిగేడు. ఆ మాట తన గుండెల్లో గునపాలు దింపింది

తన చీకటి బతుకు కొడుక్కి తెలిసిపోయింది. తన వెలుగు నాటకం రక్త సంబంధం గ్రహించింది. మరి కొడుకు ప్రశ్నకు సమాధానం ఏమిటి?

"ఇంకలా చెయ్యను నాన్నా పడుకో" అని కన్నన్ని మరింత దగ్గరకు లాక్కుంది. ఇలా అన్నట్టు తనకు వుద్వేగంలో తెలీదు

ఆ తర్వాత కూడా అలానే జరిగింది. ఇంకోరోజు "అయ్యనెవరమ్మా?" మళ్ళీ అదే ప్రశ్న

"ఏమిటినాన్నా? పీడకల లేదైనా వచ్చిందా? ఎందుకేడుస్తున్నావు పడుకో" అని ఓదార్చి నిద్రపుచ్చింది. కానీ ఆ పసివాడి కేంతెలుసు తన ఆవేదన

"నేను చీకట్లో గడిపేది నిన్ను వెలుతురులో పెంచేందుకేనని ఎలా చెప్పగలదు?

అలా చెప్పినా ఆ పసివాడు అర్థం చేసుకుంటాడా?

అలాగని విషాన్ని నాటి పిల్లాడి మనసులో అనుమానపు బీజాన్ని ఎలా పెంచేది? రేపు ఎదిగిన తర్వాత అది వృక్షంగా మారి విషఫలాల్ని కాస్తే?

కొడుకు సంగతి చెప్పుకుని భోరున ఏడ్చింది ఒకరోజు– రాఘవరావు గారితో

"అలాగా వరలక్ష్మమ్మగారూ (ఎంత దగ్గరయినా తనని 'అండీ' అనేవా డాయన)" అని చాలాసేపు యోచించి " ఇక మీ అబ్బాయి కంటపడి మీ దగ్గరికి రాను. కానీ, మీతో నా కేర్పడిన అనుబంధం, ఆప్యాయత త్రెంచుకోలేను చాటుగానైనా వచ్చి వెళ్తాను మీ జీవితానికి ఏలోటూ రానీను–నేను బతికుండేవరకూ" అన్నారు రాఘవరావు గారు

ఆయన పాదాలు పట్టుకు ఏడ్చింది– చచ్చిపోయిన భర్త గుర్తొచ్చి

అలా తామిద్దరి అనురాగాలూ అజ్ఞాతం లోకి వచ్చేసరికి కొడుక్కి పన్నెండేళ్ళు నిండేయి హైస్కూలు చదువుకి పక్క నున్న పట్నం వెళ్ళాల్సివచ్చింది

రోజూ బస్సుమీద రానుపోను చార్జీలకు పెట్టే డబ్బు–బస్తీలోనే ఏదన్నా అద్దెకొంప తీసుకుంటే బావుంటుందని రాఘవరావుగారికి చెప్పింది అయన వెంటనే ఏర్పాట్లు చేసారు

కష్టమంటే ఏమిటో తెలీకుండా కొడుకును చదివించింది కోరిన కోర్కెల్లా తీర్చింది

"మనకింత డబ్బెక్కడిదమ్మా?" అని మాటవరసకన్నా అడిగేవాడు కాదు మూర్తి

ఎప్పుడో ఒకసారి– రాఘవరావుగారు తన కంటపడ్డప్పుడు– "ఆ వెధవ మనింటి కొచ్చేడా?" అని అడిగేవాడు తన మౌనం చూసి నానా తిట్లూ తిట్టి పోసేవాడు

'ఆయన రాకపోతే ఇంత చదువు చదివేవాడివి కాదు నాయనా!' అని చెప్పా లనిపించేది కానీ వెంటనే ఆనాటి చీకటి రాత్రులు గుర్తుకు వచ్చేవి

అన్నింటినీ మించి మూర్తి మనసు ఎక్కడ దెబ్బతింటుందోననే భయం!

డిగ్రీ అయిన తర్వాత మూర్తికి వుద్యోగం దొరకటం, అతను కోరిన పిల్లనే పెళ్ళి చేసుకోవటం ఇట్టే జరిగి పోయాయి

కోడలు రావటంతో రాఘవరావుగారు, తను కలుసుకోటం చాలా కష్టమై పోయింది ఆఖరికి ధైర్యంచేసి ఆయన్ని కోడలికి పరిచయం చేసింది

"ఈయనే బాబు చదువుకి బాగా సహాయం చేసినవారు"

కానీ ఆరోజే కొడుకు విరుచుకు పడ్డాడు

"వాడి డబ్బని నాకు తెలుసుంటే

అసలు చదువుకునేవాణ్ణి కాదు" అని అరిచేడు.

"నన్ను ఇలా వెన్నుపోటు పొడుస్తావని అనుకోలేదమ్మా" అని పెద్దగా ఏడ్చేడు

ఆ మాటతో తను మొదటిసారిగా కొడుకుమీద కోపగించుకుంది

"మరెక్కడి దనుకున్నావు బాబూ!" అన్న తన ప్రశ్నకు మూర్తి మూగవాడై పోయాడు చాలాసేపు

తర్వాత-"జరిగిందేదో జరిగింది ఇక ఆ మనిషి మన గడప తొక్కకూడ దమ్మా" అన్నాడు

అదే మాట తాను రాఘవరావు గారికి చెప్పింది-చెప్పలేక చెప్పలేక తనని క్షమించమని కన్నీళ్ళు పెట్టుకుంది అప్పటికి మౌనంగా వెళ్ళిపోయాడు రాఘవరావుగారు

"మీతో పెంచుకున్న అనురాగం నన్ను వివశుణ్ణిచేస్తోంది వరలక్ష్మమ్మ గారూ! అప్పుడప్పుడైనా మిమ్మల్ని చూడకుండా వుండలేను" అన్నారు తర్వాత ఇంకోసారి వచ్చినపుడు

అవును తనలోనూ అదే భావన కొడుక్కి భయపడి అణుచుకున్న భావన ఒక్కసారి పెల్లుబికింది అయినా గొంతు దాటి రాలేదు

అ తర్వాత రెండుసార్లు వచ్చేడు రాఘవరావుగారు రెండోసారి మూర్తి కేకలు వేశాడు. తన కిష్టంలేదని కరాఖండిగా చెప్పేసాడు

అది జరిగి నెల అయింది

తర్వాత ఇవాళ వొచ్చాడాయన.

వచ్చినా ఆయన ఏమాత్రం అసభ్యంగానూ ప్రవర్తించే లేదు కూతుర్ని చూసినట్టు చూసి వెళ్ళేరు

అధికారం చెలాయించలేదు నేనే ఆదరించి వుండకపోతే నీగతేమయ్యేది? అని అహంకారంతో మాట్లాడలేదు మరాయన చేసిన నేరం ఏమిటి?

అర్ధాకలితో చెయ్యి కడుక్కుని లేచింది వరలక్ష్మమ్మగారు

గదిలోంచి కొడుకు కోడళ్ళ నవ్వులు వినబడుతున్నాయి,

* * *

"వెళ్ళొస్తాబాబూ" కళ్ళనీళ్ళు వత్తుకుంటూ అంది వరలక్ష్మమ్మగారు.

'బాబు' జవాబివ్వలేదు

తను అంత ఎత్తుకు ఎదగటానికి జీవితంలో ఎంత కిందకు దిగజారిందో ఆ తల్లి అనే భావన అతనిలో లేదు.

ద్వారబంధానికి అనుకుని ఎటోచూస్తూ నిలబడ్డాడు అతని ముఖకవళికల్లో 'విచారం' అన్నది లేదు

"వెళ్ళొస్తానమ్మా!" కోడలి వంక తిరిగింది వరలక్ష్మమ్మగారు.

'కోడలు' తిరిగైనా చూడలేదు

భర్త ప్రేమంటే ఏమిటో ఆమెకు తెలుసుగానీ, ఆ భర్త తన పాలిట

హీరో! కావటానికి హీనస్థితికి దిగజారింది అతని తల్లేనని ఆమెకు తెలీదు. తెలిసినా తెలియనట్టే వుంటుంది వుంది కూడా

కన్నీళ్ళు తుడుచుకుని వెనక్కి తిరిగింది వరలక్ష్మమ్మగారు

రాఘవరావుగారు నిన్న రావటంతో ఈ రోజు తనకు ఈ ఇంటితో ఋణం తీరిపోయింది

ఇరవైఏడేళ్ళ కొడుకు మెడపట్టి గెంటకపోయినా అంతకు మించిన మాటలన్నాడు

అవి చాలు!

కానీ తన కొడుకు మంచి స్థితిలో వున్నాడు వాడు అనాధ కాదు అన్నీ వున్నవాడు—

ప్రతిదీ తన ఇష్టప్రకారం జరిగితే మనిషికి అన్నీ వున్నట్లేనేమో!



వీధి చివరిదాకా వెళ్ళి వెనక్కి తిరిగి చూసింది

కొడుకు జాడలు కనపళ్ళేదు

ఇంటి తలుపులు వేసివుండటం కనిపించింది

కన్నీరు తుడుచుకుని ముందుకి అడుగేసింది

'ఎప్పుడన్నా బస్తీ వస్తే మా ఇంటికి రా వరలక్ష్మమ్మగారూ!' అనీ ఎప్పుడో రాఘవరావుగారు అన్నమాటలు ఆమె మనసులో చుక్కాని రూపాన్ని ధరించాయి ఆయన ఇంటి అడ్రసు వివరాలన్నీ ఆమె కటిముందున్నాయి

ఆమె నడక బస్టాండు వైపు సాగింది

* * *

రాఘవరావుగారింట్లో అడుగుపెట్టబోయే ముందు అంతరాత్మ అటకాయించింది వరలక్ష్మమ్మగారిని

'రాఘవరావుగారు భార్య, పిల్లలు

గలవాడు ఇప్పుడు నువ్వెళ్ళి ఏ బంధుత్వాన్ని కలుపుతావు?

రాఘవరావు నిన్నే విధంగా ఆదరిస్తాడు?

ఆదరించినా రెండు మూడు రోజులేగా?

అంతకు మించి ఏముంది?

నువ్వు జీవింతాంతమూ ఆయన ఇంట్లోనే వుండాలనుకుంటే ఆయన సంసారంలో చిచ్చు పెడుతున్నావని తెలుసుకో

"ఎవరూ?" అని ఎదురుగా వచ్చిన తనకన్నా నాలుగైదేళ్ళు పెద్ద వయసున్న ఆడమనిషి పిలుపుతో ఈ లోకంలో కొచ్చింది వరలక్ష్మమ్మగారు

"రాఘవరావుగారు ఉన్నారాండీ?" ధైర్యంగానే అడిగింది ఎదుటి మనిషి ఎవరా అని మనసు ఆరాటపడుతోంది ఆ మనిషి అచ్చం మహాలక్ష్మిలా వుంది కోపం, చిరాకు, విసుగు అనేవి ఆమె ముఖంలో లేవు

"రండి! వున్నారు లోపల" ఆప్యాయంగా ఆహ్వానించింది

అచేతనంగా అనుసరించింది వరలక్ష్మమ్మగారు

ఆమె ఎదరండా పక్కగదిలోకి వెళ్ళింది తనూ అనుసరించింది

"రండి! వరలక్ష్మమ్మగారూ! మీరా?" చిరునవ్వుతో ఆహ్వానించారు రాఘవరావుగారు కుర్చీలోంచి లేస్తూ

ఛళ్ళున ఏడుస్తూ ఆయన పాదాల మీద పడింది వరలక్ష్మమ్మగారు

"వరలక్ష్మమ్మగారూ!" కంగారుగా లేవనెత్తారాయన

"నా కొడుకు నన్ను" ఆమె కంఠం పెగల్లేదు

అర్థమైంది రాఘవరావు గారికి

ఆవిణ్ణి ఓదార్చి దగ్గరకు తీసుకుంటూ భార్యవైపు తిరిగి అన్నారు–

"నే చెప్పలా భాగ్యం! ఈమే ఆ ఇల్లాలు"

సంభ్రమంగా చూస్తున్న ఆయన భార్య కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి క్షణాల్లో

అక్కణ్ణించి కదిలి వెళ్ళి నిముషం తర్వాత వచ్చింది భర్త ఆశ్చర్యంగా చూస్తుండగా, వరలక్ష్మమ్మగారికి వరదేవతగా కనబడుతూ అంది–

"ఈ రోజునుంచీ మేమిద్దరం తోబుట్టువులం మీరే మా ఇద్దరికీ తాళిబొట్టు" అని వరలక్ష్మమ్మగారిని తన చేతుల్లోకి తీసుకుంటూ కుంకుమభరిణి భర్త చేతుల్లో పెట్టింది– నలుగురు పిల్లల [illegible]